10 YEAR ANNIVERSARY 2014 - 2024
# పెన్ పవర్
తెలంగాణ రౌండప్
మంగళవారం | 14 జనవరి 2025 | పేజీలు 8

## బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి అరెస్ట్

- ఓ న్యూస్ ఛానల్ కార్యక్రమంలో మాట్లాడి వస్తుండగా అరెస్ట్
- అరెస్ట్ చేసేందుకు కరీంనగర్ నుంచి వచ్చిన 35 మంది పోలీసులు
- కరీంనగర్‌కు తీసుకువెళుతున్న పోలీసులు



హైదరాబాద్ పెన్ పవర్:బీఆర్ఎస్ నేత, హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డిని హైదరాబాద్‌లోని జుబ్లీహిల్స్‌లో కరీంనగర్ పోలీసులు అరెస్ట్ చేశారు. హైదరాబాద్‌లో ఆయన ఓ న్యూస్ ఛానల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొని తిరిగి వస్తుండగా 35 మంది పోలీసులు వచ్చి అదుపు లోకి తీసుకున్నారు. కౌశిక్ రెడ్డిని హైదరాబాద్ నుంచి కరీంనగర్‌కు తరలిస్తున్నారు. సాయంత్రం కౌశిక్ రెడ్డిపై జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ కరీంనగర్ ఒకటో పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు కేసు నమోదు చేశారు. కరీంనగర్ కలెక్టరేట్‌లో తన ప్రసంగాన్ని అడ్డుకొని దురుసుగా ప్రవర్తించారని సంజయ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

# సంక్రాంతి వచ్చిందే తుమ్మెదా...

## ఊరూరా ఘనంగా సంక్రాంతి సంబరాలు

మంచుకు తడిసిన ముద్దబంతులు... ముగ్గులు...

పూలు విచ్చుకున్న గుమ్మడి పాదులు... కళ్లాపిలు....

వంట గదుల్లో తీపీ కారాల ఘుమఘుమలు...

కొత్త బట్టలు... కొత్త అల్లుళ్ల దర్పాలు...

పిల్లల కేరింతలు... ఓపలేని తెంపరితనాలు

సంక్రాంతి అంటే సందడే సందడి.

హైదరాబాద్ పెన్ పవర్:సూర్యుడు మకరరాశిలో సంక్రమించే పుణ్యకాలమే మకర సంక్రాంతి మహా పర్వదినమైంది. ఇది శీతకాలానికీ వేసవికీ మధ్య సంధి సమయం. అందుకే చలిమంటల భోగితో మొదలవుతాయి పండుగ సంబరాలు. ఉత్తరాయణ పుణ్యకాలంగా దీనికి ధార్మిక శాస్త్రాలలో ప్రాధాన్యముంది. ఈ సమయంలో చేసే స్నాన, దాన, జప, తర్పణాది మంచి పనులకు విశేష ఫలముంటుందని శాస్త్రాలు వివరించాయి. భారతీయ సంస్కృతిలో ఆసేతు హిమాచలం ఈ పండుగ చేసుకుంటారు. పంజాబ్‌లో 'లోహ్రి' పేరుతో చలిమంటలను వేసి, బంధుమిత్రులతో కలిసి ఉత్సాహంగా సంక్రాంతి సూర్యుణ్ని స్వాగతిస్తారు. మహారాష్ట్ర- కర్ణాటక ప్రాంతాల్లో నువ్వులు- బెల్లం పంచుకుని ఒకరికొకరు శుభాకాంక్షలు చెప్పుకొంటారు. తమిళనాట 'పొంగల్' సంబరాలు జరుపుతారు.మొత్తం సంవత్సరానికి ఉత్తరాయణం పగలైతే- దక్షిణాయనం రాత్రి వంటిది. అందుకే మకర సంక్రమణాన్ని సంవత్సరానికి తొలివేకువగా భావిస్తారు. కాలమంతా శుభప్రదంగా సాగాలనే సద్భావంతో ఈ రోజున పవిత్ర విధులతో, దివ్యశక్తిని అనుసంధానం చేయడం సత్సంప్రదాయం. సూర్యకిరణాలలో ప్రాణశక్తి ఉందనే వైజ్ఞానిక సత్యంతోపాటు అనేక దివ్యశక్తులు, చైతన్యవంతమైన స్పందనలు ఉన్నాయని వైదిక వాఙ్మయం వివరించింది. 'మనిషి శరీరానికి ఆత్మ ఎలా కేంద్రమో, ఈ పంచభూతాత్మక చరాచర జగత్తుకు సూర్యుడు అలా కేంద్రరూపమై ఉన్నాడని వేదం స్పష్టంగా చెబుతోంది. యోగ- వైద్య- ఉపాసనా శాస్త్రాలలో కూడా సూర్యుని అనుబంధంగా చేసే సాధనలు, యోగాభ్యాసాలు, మంత్రానుష్ఠానాలు విస్తారంగా ఉన్నాయి. ఈ సంక్రాంతి వేళ సూర్యుడి కిరణాల వెచ్చదనానికి ఆరంభ కాలం. ఆ కాంతి పుంజాలలోని దివ్యత్వాన్ని గ్రహించే ఆధ్యాత్మిక సాధనాలను రుషులు అందించారు. సౌరమానం ప్రకారం ఇక్కడి నుంచి మకర మాసం ప్రారంభమవుతుంది. ఈ మాసంలోనే చాంద్రమానాన్ని అనుసరించి మాఘమాసం మొదలవుతుంది. అదీ సూర్య ప్రధానమే. ఈ రోజున సూర్యకిరణాలు పడేలా,

-2లో





## వాటి ఆధారంగా రైతు భరోసా ఇస్తాం



- పథకాల అమలులో ఎవరికీ సందేహాలు అవసరం లేదన్న భట్టివిక్రమార్క
- వ్యవసాయ యోగ్యత కలిగిన భూములకు ఎకరాకు రూ.12 వేలు చెల్లిస్తామని వెల్లడి
- జాబ్ కార్డు తీసుకొని, 20 రోజులు పని చేసి ఉంటే ఇందిరమ్మ ఆత్మీయ భరోసా ఇస్తామని వెల్లడి

-2 లో

## కొత్త రేషన్ కార్డుల జారీకి మార్గదర్శకాలు జారీ చేసిన తెలంగాణ ప్రభుత్వం





- ఈ నెల 26 నుంచి రేషన్ కార్డులను జారీ చేయనున్న తెలంగాణ
- మంత్రివర్గ సంఘం సిఫార్సులకు అనుగుణంగా లబ్ధిదారుల ఎంపిక
- క్షేత్రస్థాయి పరిశీలన తర్వాత రేషన్ కార్డుల జారీ

-2 లో

# సంక్రాంతి వచ్చిందే తుమ్మెదా..

- మొదటి పేజి తరువాయి

ఆరు బయట కొత్త బియ్యంతో ఆవుపాలు, బెల్లం కలిపి పరమాన్నంగా వండి నివేదిస్తారు. దీనినే 'పొంగల్' అంటారు. ధనుర్మాసమంతా రంగవల్లులతో స్వాగతించే ఇంటి గుమ్మాలు, ఈ రోజున గొబ్బిళ్లతో పూర్ణ కళలతో భాసిల్లుతాయి. నేలతల్లి ఇచ్చిన పంటలు నింగిలోని సూర్యుని అనుగ్రహశక్తి ఫలితమేనని నమ్మి ప్రకృతి పట్ల కృతజ్ఞత చూపడం ఈ పండుగ ప్రత్యేకత.

సూర్యకిరణాలకు ప్రతీకలుగానే గాలిపటాలను ఎగురవేస్తారు. పావన నదీ స్నానం మంచిది. అందుకే ప్రయాగ లాంటి తీర్థాలలో ఈ రోజున పుణ్యస్నానాలను ఆచరిస్తారు. ఈ రోజున చేసే మంగళ కార్యాలు అక్షయ ఫలాలనిస్తాయన్నది శాస్త్ర వచనం. అందుకే దేవతారాధన, దానం, పితృతర్పణం వంటివి నేడు విశేషంగా చేస్తారు. అమంగళాలు తొలగాలని భోగి మంటలతో, పిల్లలకి భోగి పళ్లతో సంక్రాంతిని జరుపుకొంటారు. నింగిలో కాంతి సంపద, నేలపై సస్య సంపద వెరసి 'సంక్రాంతి లక్ష్మి'గా ఆవిష్కృతమవుతుంది. బంధుమిత్రుల సమాగమాలతో ఉత్సాహాలను వెల్లువెత్తించే వెలుగుల పండుగ ఇది.

మన పండుగలను ఎన్నో అంశాలను మిళితం చేసి ప్రయోజనాత్మకంగా రూపొందించారు మన పెద్దలు. ప్రకృతిలో వచ్చే మార్పులకు అనుగుణంగా పండుగ విధులుగా చెప్పి వ్యక్తిగత, కుటుంబపరమైన, సామాజిక క్షేమాలని కలిగించేవిగా వాటిని రూపొందించారు. మన పండుగల్లో ఖగోళ, ఆయుర్వేద, ఆర్థిక మొదలైన శాస్త్రవిజ్ఞానాలు మిళితమై ఉంటాయి. తెలుగువారి ప్రధానమైన పండుగ సంక్రాంతిలో కూడా అంతే!

ప్రధానంగా చాంద్రమానాన్ని పాటించే తెలుగువారు సౌరమానాన్ని పాటించే ముఖ్యమైన సందర్భం ఇది. సూర్యుడు ధనూరాశిలో ప్రవేశించినప్పటి నుండి ధనుర్మాసం అంటారు. అది డిసెంబరు 15 కాని, 16వ తేదీ కాని అవుతుంది. అప్పటి నుండి మకర సంక్రమణం వరకు అంటే జనవరి 14 కాని, 15 వ తేదీ వరకు కాని ఉంటుంది.

సూర్యుడు మకర రాశిలో ప్రవేశించే రోజు మకర సంక్రాంతి. ఆ రోజు నుండి సూర్యుడు తన గమన దిశని దక్షిణం నుండి ఉత్తరానికి మార్చుకుంటాడు కనుక మకర సంక్రమణానికిప్రాధాన్యం. ఆ రోజు పితృదేవతలకి తర్పణాలు ఇస్తారు. బొమ్మల కొలువుపెట్టుకునే సంప్రదాయం కొన్ని ప్రాంతాలలో ఉంది.

అసలు ప్రధానమైనది సంక్రాంతి. ఈ పుణ్యకాలంలో దానాలు, తర్పణాలుప్రాధాన్యం వహిస్తాయి. ఈ సమయంలో చేసే దానాలకి ఎన్నో రెట్లు ఎక్కువ ఫలితం ఉంటుంది. దానికి కారణం ఈ మూడురోజులు పాతాళం నుండి వచ్చి భూమిని పరిపాలించమని శ్రీమహావిష్ణువు బలిచక్రవర్తికి వరం ఇచ్చాడు. కనుక బలి తనకి ఇష్టమైన దానాలు చేస్తే సంతోషిస్తాడు. అందులోనూ గుమ్మడికాయను దానం చేయటం మరీ శ్రేష్ఠం. గుమ్మడిని దానం ఇస్తే భూగోళాన్ని దానం ఇచ్చినంత ఫలితం. మకరరాశిలో ఉండే శ్రవణానక్షత్రానికి అధిపతి అయిన శని శాంతించటానికి నువ్వుల దానం చేయటం శ్రేయస్కరం. వస్త్రదానం,పెరుగుదానంతో పాటు, ఏ దానాలు చేసినా మంచిదే. భోగినాడు ఏ కారణంగానైనా పేరంటం చేయనివారు ఈ రోజు చేస్తారు. అసలు మూడురోజులు పేరంటం చేసే వారున్నారు.

సంక్రాంతి మరునాడు కనుము. కనుముని పశువుల పండగ అని కూడా అంటారు. ఈ రోజు పశువుల శాలలని శుభ్రం చేసి, పశువులని కడిగి, కొమ్ములకి రంగులు వేసి,పూలదండలని వేసి, ఊరేగిస్తారు. వాటికి పోటీలు పెడతారు. ఎడ్లకి పరుగు పందాలు, గొర్రె పొట్టేళ్ళ పోటీలు, కోడిపందాలు మొదలైనవి నిర్వహిస్తారు. నాగలి, బండి మొదలైన వాటిని కూడా పూజిస్తారు. ఇప్పుడు ట్రాక్టర్లకి పూజ చేస్తున్నారు. భూదేవికి, రైతులకి, పాలేర్లకి, పశువులకి, వ్యవసాయ పనిముట్లకి కూడా తమ కృతజ్ఞతలని తెలియచేయటం పండుగలోని ప్రతి అంశంలోనూ కనపడుతుంది. మాంసాహారులు ఈరోజు మాంసాహారాన్ని వండుకుంటారు. సాధారణంగా కోడిపందెంలో ఓడిపోయిన కోడినో, గొర్రెనో ఉపయోగించటం కనపడుతుంది. ఓడిపోయిన జంతువు పట్ల కూడా గౌరవమర్యాదలని చూపటం అనే సంస్కారం ఇక్కడ కనపడుతుంది. పంటను పాడుచేసే పురుగులని తిని సహాయం చేసినందుకు పక్షులకోసం వరికంకులను తెచ్చి కుచ్చులుగా చేసి, ఇంటి ముందు వసారాలలో కడతారు. కొన్ని ప్రాంతాలలో ఇప్పటికీ కనుమునాడు గుడిలో వరికంకుల గుత్తులను కట్టే సంప్రదాయం కొనసాగుతోంది.

'కనుము నాడు కాకైనా కదలదు','కనుము నాడు కాకైనా మునుగుతుంది','కనుము నాడు మినుము తినాలి' అనే సామెతలు కనుముకి పితృదేవతలకు ఉన్న సంబంధాన్ని సూచిస్తాయి. మొత్తం నెల రోజులు విస్తరించి, నాలుగు రోజుల ప్రధానంగా ఉన్న పెద్ద పండగ సంక్రాంతి తెలుగువారికి ఎంతో ఇష్టమైన వేడుక.

## వాటి ఆధారంగా రైతు భరోసా ఇస్తాం

**హైదరాబాద్ పెన్ పవర్:** రైతు భరోసాపై తెలంగాణ ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క కీలక వ్యాఖ్యలు చేశారు. రెవెన్యూ రికార్డుల ఆధారంగా రైతు భరోసా ఇస్తామని వెల్లడించారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి రూ.22,500 కోట్లు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసాకు రూ.2,000 కోట్లు, రైతు భరోసాకు రూ.19 వేల కోట్ల చొప్పున ఖర్చు చేసుకుంటూ ముందుకు వెళుతున్నామన్నారు. ఈ పథకాల అమలులో ఎవరికీ సందేహాలు అవసరం లేదన్నారు. లబ్ధిదారుల ఎంపిక, అమలుకు విధివిధానాలు లోతుగా చర్చించాకే కేబినెట్ ప్రకటన చేసినట్లు చెప్పారు. వ్యవసాయ యోగ్యత కలిగిన భూములన్నింటికి ఎకరాకు రూ.12 వేలు చెల్లిస్తామన్నారు. ఆర్ఓఎఫ్ఆర్ పట్టాలు పొందిన రైతులకు కూడా ఈ పథకం వర్తిస్తుందన్నారు. రెవెన్యూ రికార్డుల ఆధారంగా వ్యవసాయ శాఖ రైతు భరోసా పథకాన్ని అమలు చేస్తుందన్నారు. ఉపాధి హామీ పథకంలో జాబ్ కార్డు తీసుకున్న కుటుంబం కనీసం 20 రోజులు పని చేసి ఉండి, సెంటు భూమిలేని వ్యవసాయ కూలీలకు ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకం అందుతుందన్నారు. రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్లకు కూడా పూర్తిగా అర్హులనే ఎంపిక చేస్తామన్నారు. గ్రామ సభలను ఏర్పాటు చేసి ప్రభుత్వ పథకాలను అధికారులు వెల్లడించాలన్నారు. గ్రామసభల్లోనే లబ్ధిదారుల ఎంపిక, ఖరారు జరుగుతుందన్నారు. గ్రామ సభల్లోని అర్హులైన వారికి పథకాల అనుమతి పత్రాలు అధికారులు, ప్రజాప్రతినిధులు అందజేస్తారన్నారు. ప్రభుత్వ జీవో ప్రకారం సంక్షేమ పథకాలు అమలవుతున్నాయా? లేదా? అనేది ఇందిరమ్మ కమిటీలు పర్యవేక్షిస్తాయని వెల్లడించారు. సంక్షేమ పథకాల అమలులో ఇందిరమ్మ కమిటీలు కీలకమన్నారు.

## కొత్త రేషన్ కార్డుల జారీకి మార్గదర్శకాలు జారీ చేసిన తెలంగాణ ప్రభుత్వం

**హైదరాబాద్ పెన్ పవర్:**రాష్ట్రంలో కొత్త రేషన్ కార్డుల జారీకి తెలంగాణ ప్రభుత్వం ఈరోజు మార్గదర్శకాలను విడుదల చేసింది. ఈ నెల 26 నుంచి రేషన్ కార్డులను జారీ చేయనున్నారు. కొత్త రేషన్ కార్డుల కోసం ఎంతోమంది ఎదురు చూస్తున్నారు. తాజా నిర్ణయంతో, ఏళ్ళుగా అపరిష్కృతంగా ఉన్న వినతుల పరిష్కారం దిశగా ప్రభుత్వం ముందడుగు వేసింది.మంత్రివర్గం ఉపసంఘం సిఫార్సులకు అనుగుణంగా లబ్ధిదారుల ఎంపిక జరగనుంది. దరఖాస్తులను నిశితంగా పరిశీలించాక కులగణన సర్వే ఆధారంగా రేషన్ కార్డులు లేని కుటుంబాల జాబితాను జిల్లా కలెక్టర్, జీహెచ్ఎంసీ కమిషనర్‌కు క్షేత్రస్థాయి పరిశీలన కోసం పంపిస్తారు.మండలస్థాయిలో ఎంపీడీవో, యూఎల్‌బీలో మున్సిపల్ కమిషనర్ ఈ మొత్తం ప్రక్రియకు బాధ్యులుగా ఉంటారు. రేషన్ కార్డు ముసాయిదా జాబితాను గ్రామసభ, వార్డుల్లో ప్రదర్శించి, చదివి వినిపించిన తర్వాత ఆమోదం లభిస్తుంది.

## ఉత్తరప్రదేశ్‌లో ప్రారంభమైన మహా కుంభమేళా

**హైదరాబాద్ పెన్ పవర్:**ఉత్తరప్రదేశ్ లో మహా కుంభమేళా ప్రారంభమైంది. తొలి రోజు ఉదయం గంగా యమునా సరస్వతి నదులు కలిసిన త్రివేణి సంగమం వద్ద దాదాపు 50 లక్షల మందికిపైగా భక్తులు పుణ్యస్నానాలు చేశారు. ప్రపంచంలోనే అత్యధిక మంది సమ్మేళనమైన కార్యక్రమంగా ఈ మహా కుంభమేళా రికార్డుల్లోకి ఎక్కనుంది. ఈ కుంభమేళాకు దాదాపుగా 45 కోట్ల మందికిపైగా భక్తులు తరలివస్తారని నిర్వాహకులు అంచనా వేస్తున్నారు. ఇది అమెరికా, రష్యా దేశాల జనాభా కంటే కూడా ఎక్కువ కావడం గమనార్హం.కుంభమేళా ప్రతి పన్నెండేళ్లకు ఒకసారి జరుగుతుంది. అయితే ఇప్పుడు జరిగేది మహా కుంభమేళా. ఈ మహా కుంభమేళా 144 ఏళ్లకు ఒకసారి జరుగుతుంది. ఇవాళ ప్రారంభమైన కుంభమేళా ఫిబ్రవరి 26 వరకు కొనసాగనుంది. ఈ మహా కుంభమేళా ఉత్తరప్రదేశ్ సర్కారును ఆర్థికంగా ఎంతో బలోపేతం చేయనుంది. ఈ 45 రోజుల మహా కుంభమేళా నిర్వహణ కోసం యూపీ సర్కారు రూ.7 వేల కోట్ల బడ్జెట్‌ను కేటాయించింది.అయితే మహా కుంభమేళాకు రూ.7 వేల కోట్లు ఖర్చు చేస్తే.. యూపీకి ఆదాయం రూపంలో దాదాపు రూ.2 లక్షల కోట్లు వచ్చే అవకాశం ఉన్నదని ఆర్థిక నిపుణులు అంచనా వేస్తున్నారు. ఒకవేళ భక్తులు 45 కోట్ల మంది రాకపోయినా 40 కోట్ల మందే వచ్చినా.. ఒక్కో భక్తుడు రూ.5 వేల చొప్పున ఖర్చు చేసినా రాష్ట్రానికి రూ.2 లక్షల కోట్ల ఆదాయం సమకూరే అవకాశం ఉన్నదని వారు చెబుతున్నారు. ఇక భక్తులు రూ.10 వేల చొప్పున ఖర్చు చేస్తే మొత్తం రూ.4 లక్షల కోట్ల ఆదాయం సమకూరినా ఆశ్చర్యపోవాల్సిన అవసరం లేదని తెలిపారు.కాగా 2019లో జరిగిన అర్థ కుంభమేళా ద్వారా రాష్ట్ర ప్రభుత్వానికి రూ.1.2 లక్షల కోట్ల ఆదాయం సమకూరినట్లు ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగీ ఆదిత్యనాథ్ చెప్పారు. ఆ కుంభమేళాకు 24 కోట్ల మంది భక్తులు వచ్చారు. ఐదేళ్ల క్రితం 24 కోట్ల మంది భక్తులు వస్తేనే రూ.1.2 లక్షల కోట్ల ఆదాయం వచ్చినప్పుడు.. ఈసారి 40 కోట్ల మంది కంటే ఎక్కువ భక్తులు వచ్చే అవకాశం ఉన్నందున రూ.2 లక్షల కోట్ల ఆదాయం రావడం అసాధ్యమేమీ కాదని ఎక్స్‌పర్ట్స్ చెబుతున్నారు

# రాజపేటలో ఎమ్మార్పీఎస్ ప్రదర్శన..

## ఫిబ్రవరి 7న, లక్ష డప్పులు వేల గొంతుల సభకు తరలి రావాలని పిలుపు..



**రాజాపేట,పెన్ పవర్,జనవరి 13:** ఈనెల 27న జిల్లా కేంద్రంలో జరిగే జిల్లాస్థాయి డప్పు ప్రదర్శనను జయప్రదం చేయాలని కోరుతూ సోమవారం రాజపేటలో ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో ప్రదర్శన నిర్వహించారు..ఎంఆర్పీయస్ నేతలు - నల్ల చంద్ర స్వామి మాదిగ, మంద శంకర్ మాదిగలు మాట్లాడుతూ ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణను తెలంగాణ రాష్టంలో తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేశారు.. ఎమ్మార్పిఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మందకృష్ణ మాదిగ నాయకత్వంలో ఫిబ్రవరి 7న హైదరాబాద్‌లో నిర్వహించనున్న లక్ష డప్పులు వెయ్యి గొంతుల మండే మాదిగల గుండె చప్పుడు మహా ప్రదర్శన విజయవంతం చేయాలన్నారు.. రాజాపేట మండల కేంద్రంలో ఎమ్మార్పిఎస్, ఎంఎస్పీ ఆధ్వర్యంలో డప్పు ప్రదర్శన ప్రచారం నిర్వహించారు.. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎమ్మార్పియస్ నేతలు,యంయస్పీ జిల్లా అధ్యక్షులు నల్ల చంద్ర స్వామి మాదిగ
జాతీయ నాయకులు మంద శంకర్ మాదిగలు హాజరయ్యారు.. ఎమ్మార్పీఎస్ నాయకులు మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణతోనే మాదిగల భవిష్యత్తు ఉంటుందని మహాజన నేత మందకృష్ణ మాదిగ నాయకత్వంలో ఉద్యమించి పోరాటం చేస్తే ఆగస్ట్ 1న సుప్రీంకోర్టు వర్గీకరణ రాష్టాలు చేసుకోవచ్చు అని తీర్పునిస్తే..! తెలంగాణ రాష్టంలో అమలు చేయకుండా జాప్యం చేస్తున్నందుకు నిరసనగా
ఫిబ్రవరి 7న మందకృష్ణ మాదిగ నాయకత్వంలో
లక్ష డప్పులు వేల గొంతుల
మండే మాదిగల గుండె చప్పుడు మహా సాంస్కృతిక ప్రదర్శనకు ప్రతి మాదిగ ఇంటికి తాళం పెట్టి ఇంటిలో అందరు సంకకు డప్పు వేసుకొని హైదరాబాద్ చేరుకొని మాదిగల శక్తిని ఈ ప్రపంచానికి చూపెట్టాలని పిలుపునిచ్చారు.. దండోరా ఉద్యమానికి వెన్నుదన్నుగా నిలచి అశువులు బాసిన పెద్దలు మంద జగన్నాథం, చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో
యం యస్ పీ జిల్లా అధ్యక్షులు నల్ల చంద్ర స్వామి మాదిగ, జాతీయ నాయకులు మంద శంకర్ మాదిగ, సీనియర్ నాయకులు ఎర్రగుంట ప్రభాకర్ మాదిగ, రామ్ గొల్ల శ్రీనివాస్ మాదిగ,మోత్కూపల్లి నవీన్ మాదిగ, పెద్దల ప్రభాకర్ మాదిగ, రాంగోళ్ళ బాబు మాదిగ, కోయ బాలరాజు మాదిగ, పెద్దల మల్లేష్ మాదిగ, దేశాపాండ ప్రసాద్ మాదిగ, సగ్గు ఆంజనేయులు మాదిగ, ఎర్ర బాబు మాదిగ, సిరిపంగా గణేష్ మాదిగ, కోయ ఉపేందర్ మాదిగ
తదితరులు పాల్గొన్నారు.

## మేడ్చల్ మున్సిపల్ బిజెపి అధ్యక్షురాలుగా జల్లి శైలజ..



జల్లి శైలజ హరినాథ్.. మేడ్చల్ మున్సిపల్ బీజేపీ అధ్యకురాలు..

**మేడ్చల్, పెన్ పవర్, జనవరి 13:** మేడ్చల్ మున్సిపాలిటీ బిజెపి అధ్యక్షురాలుగా మాజీ జడ్పీటీసీ జల్లి శైలజ హరినాథ్‌ని బిజెపి ఎన్నికల అధికారి మురళీధర్ గౌడ్ ప్రకటించినట్లు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు.. ఈ సందర్భంగా బిజెపి అధ్యక్షురాలు జల్లి శైలజ మాట్లాడుతూ బిజెపి అధిష్ఠానం తనపై నమ్మకంతో మున్సిపల్ అధ్యక్ష బాధ్యతలు అప్పగించడంతో మరింత భాధ్యత పెరిగిందని,పదవిగా భావించకుండా భాధ్యతగా భావించి మేడ్చల్ జిల్లాలో బిజెపి మేడ్చల్ మున్సిపాలిటీ అగ్రస్థానంలో నిలిచే విధంగా ప్రయత్నిస్తానని తెలిపారు.బూత్ స్థాయి నుంచి పార్టీనీ బలోపేతం చేయడమే తన లక్ష్యమని తెలిపారు.. మేడ్చల్ మున్సిపాలిటీ అభివృద్ధిలో ఎలాంటి సమస్య అయిన ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి,సమస్యను పరిష్కరించే దిశగా బిజెపి కార్యాచరణ రూపొందిస్తామని తెలిపారు.

## నాంపల్లి ఆలయంలో.. ఘనంగా గోదా రంగనాయకుల కళ్యాణం..



**వేములవాడ,పెన్ పవర్,జనవరి 13:** రాజన్న సిరిసిల్ల జిల్లా, వేములవాడ శ్రీ రాజ రాజేశ్వర స్వామి ఆలయం దత్తత తీసుకున్న నాంపల్లి గుట్టపై వెలసిన లక్ష్మీ నరసింహస్వామి ఆలయంలో, సోమవారం గోదా రంగనాయకుల స్వామి కళ్యాణం ఘనంగా నిర్వహించారు.. ఆలయ అర్చకుల ఆధ్వర్యంలో వేద పండితుల మంత్రోచ్ఛారణల మధ్య స్వామివారి కళ్యాణం అత్యంత వైభవోపేతంగా నిర్వహించారు.. స్వామివారి కళ్యాణాన్ని తిలకించేందుకు పెద్ద సంఖ్యలో భక్తులు గుట్టపైకి తరలివచ్చారు.. కాగా నాంపల్లి లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో 600 ఏళ్లుగా ప్రతి సంవత్సరం గోదా రంగనాయకుల స్వామి కళ్యాణ ఘట్టాన్ని ప్రతియేటా పుష్య మాసంలో నిర్వహిస్తున్నట్టు ఆలయ అర్చకులు తెలిపారు.. ప్రభుత్వ విప్ వేములవాడ శాసనసభ్యులు ఆది శ్రీనివాస్, బిఆర్ఎస్ వేములవాడ నియోజకవర్గం ఇన్చార్జి చెలిమడ లక్ష్మీ నరసింహారావు,పలువురు నాయకులు, కళ్యాణంలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు..

## పాడి కౌశిక్ రెడ్డి అరెస్ట్‌పై తీవ్రంగా స్పందించిన హరీశ్ రావు

**హైదరాబాద్ పెన్ పవర్:**హుజూరాబాద్ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ నేత పాడి కౌశిక్ రెడ్డి అరెస్ట్‌పై ఆ పార్టీ సీనియర్ ఎమ్మెల్యే హరీశ్ రావు తీవ్రంగా స్పందించారు. ఎక్స్ వేదికగా రేవంత్ రెడ్డి ప్రభుత్వంపై నిప్పులు చెరిగారు. కౌశిక్ రెడ్డిని అక్రమంగా అరెస్ట్ చేశారని, దీనిని ఖండిస్తున్నామని పేర్కొన్నారు. మీది ఏ పార్టీ అని, పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేను ప్రశ్నించినందుకే కౌశిక్ రెడ్డిపై కేసులు పెడతారా? అని ప్రశ్నించారు. కేసీఆర్ పాలనలో పదేళ్లు ప్రశాంతంగా ఉన్న తెలంగాణ, 13 నెలల కాంగ్రెస్ పాలనలో కక్షపూరిత రాజకీయాలకు నిలయంగా మారడం శోచనీయమన్నారు.ప్రశ్నిస్తున్న ప్రజాప్రతినిధులపై అక్రమ కేసులు బనాయించడం, నిలదీస్తే పార్టీ కార్యాలయాలపై దాడులు చేయడం నిత్యకృత్యం కావడం సిగ్గుచేటు అని రాసుకొచ్చారు. సీఎం రేవంత్ రెడ్డి ఆరు గ్యారంటీలు, హామీల అమలు, పరిపాలనను గాలికి వదిలేసి ప్రతిపక్షాలను వేధించడమే లక్ష్యంగా పెట్టుకున్నాడని ఆరోపించారు.ప్రశ్నిస్తే కేసులు, నిలదీస్తే దాడులు, అడిగితే అరెస్టులు...
ఇందిరమ్మ రాజ్యం అంటే ఇదేనా? అని నిలదీశారు. ఏడో గ్యారంటీగా ప్రజాస్వామ్య పునరుద్ధరణ అని డబ్బా కొట్టి... ఇప్పుడు, ఉన్న ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేశారని ఆరోపించారు. తద్వారా ఎమర్జెన్సీ పాలనను తలపిస్తున్నారని దుయ్యబట్టారు.మీ అణచివేతలకు, మీ నిర్బంధాలకు, మీ దాడులకు బీఆర్ఎస్ పార్టీ అదరదు... బెదరదన్నారు. ప్రజాక్షేత్రంలో మిమ్మల్ని అడుగడుగునా నిలదీస్తూనే ఉంటామని, ప్రజల తరఫున పోరాటం చేస్తూనే ఉంటామన్నారు. అక్రమంగా అరెస్ట్ చేసిన ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డిని తక్షణం విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

## సమోసాలో బ్లేడు.. చంపేయండ్రా చంపేయండి ఇలా కూడా..



**హైదరాబాద్ పెన్ పవర్:**సరదాగా సమోసా తిందామని పోతే చంపేసేలా ఉన్నారు వీళ్లు. హోటళ్లు, రెస్టారెంట్, వీధుల్లో ఆహార పదార్థాలు అమ్మేవారు.. కస్టమర్ల ఆరోగ్యం సంగతి పక్కనబెట్టి.. వ్యాపార లాభాలు చూసుకుంటున్నారు..తినే ఫుడ్ లో ఏకంగా బొద్దింపులు , ఎలుకలు, పురుగుతులు, ఇనుప ముక్కలు, బ్లేడ్లు వస్తున్న పట్టించుకోవడం లేదు. ఓ రెస్టారెంట్ బిర్యానీలో బొద్దింకలు, ఇనుప ముక్కలు..బేకరీలో అమ్ముతున్న కూల్ డ్రింక్స్ లో గుట్కా ప్యాకెట్లు..ఇలాంటి న్యూసే సోషల్ మీడియాలో, టీవీలు, పత్రికల్లో తరుచుగా చూస్తున్నాం. వీధుల్లో దొరికే ఆహార పదార్థాల్లో ఏదో హానికలిగించే వస్తువుల ప్రత్యక్ష మవడం ఆందోళన కలిగిస్తోంది. ఎప్పుడు ఇంట్లో ఫుడ్డేనా.. ఓసారి బజారుకు పోయి ఏదో తిందామని పోతే ఏకంగా ప్రాణాల మీదకే వచ్చే పరిస్థితి ఏర్పడుతుంది. తాజాగా రాజస్థాన్ లోని టోంక్ అనే ప్రాంతంలో సమోసాలో ఏకంగా బ్లేడ్ రావడంతో కస్టమర్ బెంబేలెత్తిపోయాడు. వేడి వేడి సమోసా తిందామని వచ్చిన అతను బ్లేడ్ చూసి షాక్ తిన్నాడు. టోంక్ ప్రాంతంలో నివాసముండే హోంగార్డు గా పనిచేస్తున్న వర్మ అనే వ్యక్తి ఏదైనా తిందామని రోడ్ సైడ్ స్నాక్స్ స్టాల్స్ కు వెళ్లాడు. సమోసా తింటుండగా.. పదునైన షేవింగ్ బ్లేడ్ నోట్లోకి రావడంతో షాక్ తిన్నాడు. ఈ విషయంపై స్నాక్స్ స్టాల్ ఓనర్ ను ప్రశ్నించగా చాలా లైట్ గా తీసుకొని నిర్లక్ష్యంగా మాట్లాడాడు.దీంతో హోంగార్డు తనకు ఎదురైన అనుభవాన్ని సోషల్ మీడియాలో షేర్ చేశాడు. అంతేకాదు.. పోలీసులకు, ఫుడ్ సేఫ్టీ డిపార్టుమెంట్ కు ఫిర్యాదు చేశాడు.

దీనిపై స్పందించిన నెటిజన్లు.. ఫుడ్ సేఫ్టీఅ ధికారులు విస్తృత తనిఖీలు చేపట్టాలి. ఇలాంటి ఫుడ్ సప్లయ్ చేస్తున్నవారిపై కఠిన చర్యలు తీసుకోవాలని సూచిస్తున్నారు.

## ఇలాంటి చిల్లర చేష్టలతో బీఆర్ఎస్ ఆత్మస్థైర్యాన్ని దెబ్బతీయలేరు: కేటీఆర్

**హైదరాబాద్ పెన్ పవర్:** హుజూరాబాద్ బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డిని కరీంనగర్ పోలీసులు అరెస్ట్ చేయడంపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్పందించారు. ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి అరెస్ట్ దుర్మార్గమని పేర్కొన్నారు. అక్రమ కేసులు బనాయించి, అన్యాయంగా అరెస్ట్ చేయడం రేవంత్ రెడ్డి సర్కారుకు అలవాటుగా మారిందని విమర్శించారు. పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేను వెనుకేసుకొచ్చి, కౌశిక్ రెడ్డిని అరెస్ట్ చేయడం అప్రజాస్వామికమని కేటీఆర్ పేర్కొన్నారు. పోరాటాలే ఊపిరిగా పుట్టిన బీఆర్ఎస్ పార్టీ ఆత్మస్థైర్యాన్ని ఇలాంటి చిల్లర చేష్టలతో దెబ్బతీయలేరని స్పష్టం చేశారు. కౌశిక్ రెడ్డిని బేషరతుగా విడుదల చేయాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. నిన్న కరీంనగర్ జిల్లా కలెక్టర్ లో మంత్రుల సమీక్షలో జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ తో పాడి కౌశిక్ రెడ్డి తీవ్రస్థాయిలో ఘర్షణ పడడం తెలిసిందే. సంజయ్ ఫిర్యాదు నేపథ్యంలో కేసు నమోదు చేసుకున్న కరీంనగర్ పోలీసులు నేడు పాడి కౌశిక్ రెడ్డిని హైదరాబాదులో అదుపులోకి తీసుకున్నారు.

# జోడేఘాట్ అభివృద్ధిపై.. మంత్రి సీతక్క హామీ..

**జంగుభాయ్ ఆలయానికి ఆదివాసి సాంప్రదాయ దుస్తులతో మంత్రి సీతక్క దర్శనం..**

**రూ.4.96 కోట్లతో జోడేఘాట్‌లో అభివృద్ధి పనులకు మంత్రి సీతక్క శంకుస్థాపనలు చేశారు..**

**కొమురంభీమ్ నడయాడిన జోడేఘాట్ ప్రాంతాన్ని పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేస్తా: సీతక్క..**





**కెరమెరి, పెన్ పవర్, జనవరి 13:** రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి ధనసరి అనసూయ (సీతక్క) కొమురంభీమ్ జిల్లాలో సోమవారం పర్యటించారు.. పోరాట యోధుడు కొమురం భీం నడయాడిన గడ్డ జోడేఘాట్‌లో పర్యాటక అభివృద్ధి కోసం రూ.4.96 కోట్ల వ్యయంతో వివిధ అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేశారు..అనంతరం కెరమెరి మండలంలోని జంగుబాయి ఆలయంలో నిర్వహించే జాతర వేడుకలకు సాంప్రదాయ ఆదివాసి చీరలు ధరించి మంత్రి సీతక్క, ఎమ్మెల్యే కోవలక్ష్మి, పార్లమెంట్ ఇన్‌చార్జ్ సుగుణక్క హాజరయ్యారు.. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ జోడేఘాట్ అభివృద్ధికి తమ ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. కొమరం భీమ్ స్ఫూర్తితో అధికారంలోకి వచ్చిన తాము గడిచిన సంవత్సరంలో జోడేఘాట్ ఆదివాసీల అభివృద్ధి కోసం చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.. పర్యాటక ప్రాంతంగా అభివృద్ధికై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించామన్నారు.. జంగుబాయి ఆలయంలో నిర్వహించే ఆదివాసీల జాతరను వారు సాంప్రదాయ ఆదివాసుల దుస్తులు ధరించి ప్రారంభించారు. సంస్కృతి, సాంప్రదాయాలు ఆదివాసులు విభిన్నంగా ఉండడమే ప్రత్యేక గుర్తింపుగా నిలుస్తుందన్నారు..

# ఏపీలో కత్తులు దూస్తున్న కోళ్లు.. గోదావరి జిల్లాలో జోరుగా పందెలు



**హైదరాబాద్ పెన్ పవర్:**సంక్రాంతి పండుగ అంటే రంగవల్లులు, గొబ్బెమ్మలు, హరినాథుల కీర్తనలు, పిండి వంటలు ఒక ఎత్తు అయితే.. కోడి పందెలు మరోఎత్తు. సంక్రాంతి సంబరాలకు సరికొత్త ఉత్సాహాన్ని, ఉద్వేగాన్ని తీసుకొస్తాయి కోడి పందాలు. కోళ్ల పందాలను ప్రభుత్వం నిషేదించిన సంక్రాంతి సంబురంలో భాగంగా ప్రతియేటా జరుగుతూనే ఉన్నాయని పందాలు. కొన్ని చోట్ల ఈ కోడి పందాలు సరదా కోసం నిర్వహిస్తుండగా.. మరికొన్ని చోట్ల కోట్లాది రూపాయల బెట్టింగ్ జరుగుతోంది. రాష్ట్రం మొత్తం సంక్రాంతి ఒక ఎత్తు అయితే.. ఉభయ గోదావరి జిల్లాల్లో సంక్రాంతి నెక్స్ట్ లెవల్‌లో ఉంటుంది. సంబరాలతో పాటు కోడి పందాలు కూడా ఉభయ గోదావరి జిల్లాల్లో పెద్ద ఎత్తున జరుగుతాయి. సంక్రాంతి పండుగ వేళ ఒక్క గోదావరి జిల్లాల్లోనే కోట్లల్లో కోడి పందాలు బెట్టింగ్ జరుగుతుందంటే అతిశయోక్తి కాదు. ప్రతి ఏడాదిలాగా ఈ సారి కూడా గోదావరి జిల్లాల్లో కోడి పందేల జాతర మొదలయ్యింది. ప్రభుత్వం నిషేదం విధించినా.. మనల్నెవడ్రా ఆపేది అంటూ కత్తులు కట్టుకుని కాలుదువ్వుతున్నాయి పందెం కోళ్లు. పందలు వేలు దాటి లక్షల్లో బెట్టింగులు కాస్తూ రెచ్చిపోతున్నారు పందెంరాయుళ్లు. పోలీసులు ఆంక్షలు విధించిన మనకి కాదులే అంటూ లైట్ తీసుకుంటున్నారు పందెం నిర్వాహకులు. ఇప్పటికే 10 వేలకు 20వేలు.. 50వేలకు లక్ష.. లక్షకు రెండు లక్షలంటూ జోరుగా బెట్టింగ్స్ సాగుతున్నాయి. పందెం రాయుళ్లను ఆకర్షించేందుకు నిర్వాహకులు వినూత్న ఐడియాలు అవలంభిస్తున్నారు. ఎక్కువ పందాలు గెలిచినవారికి కార్లు, బైకులు అంటూ ఆకర్షనీయమైన బహుమతులు ఇస్తామని ఆఫర్ చేస్తున్నారు. గోదావరి జిల్లాల్లో అయితే ఇంకా ఖరీదైన బహుమతులు అనౌన్స్ చేశారు. పందెంలో గెలిచిన వారికి బుల్లెట్, బైక్ , రెండు కాసుల బంగారం అంటూ బెట్టింగ్ రాయుళ్లను కవ్విస్తున్నారు. ఈ సంక్రాంతి పండగను పురస్కరించుకుని ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో 200 బరులు సిద్ధం చేసినట్లు టాక్. ఈ సారి భీమవరంలో కూడా కోడి పందాలు భారీ ఎత్తున నిర్వహిస్తున్నారు. ఏకంగా క్రికెట్ స్టేడియాలను తలపించేలా బరులను సిద్ధం చేశారు నిర్వాహకులు. దీంతో ఈ సారి అందరి చూపు భీమవరంలో జరిగే కోడి పందాలపైనే ఉంది. దీంతో భీమవరంలో నెల రోజుల క్రితమే హోటల్స్ ఫుల్ అయిపోయాయి. మొత్తంగా ఈ మూడు రోజులూ ఎక్కడ చూసిన పందెం రాయుళ్ల జోషే కనిపిస్తోంది. నిర్వాహకులు తమదైన శైలిలో సిద్ధం అవుతుంటే పందాలను అడ్డుకునేందుకు పోలీసులు కూడా వీరికి ధీటుగా ప్లాన్ చేస్తున్నారు.

# భోగి మంట ఎందుకు వేస్తారు.. పిల్లలకు భోగి పళ్లు ఎందుకు పోస్తారు.. విశిష్ఠత తెలుసుకుందామా..!

**హైదరాబాద్ పెన్ పవర్:**తెలుగిళ్ళలో సంప్రదాయబద్ధంగా జరుపుకునే పండుగల్లో ఒకటి 'భోగి'. మూడు రోజులపాటు సాగే సంక్రాంతి వేడుకల్లో మొదటిది భోగి, సంక్రాంతికి ఒక రోజు ముందు వచ్చే ఈ పండుగకు మన సంప్రదాయంలో ఎంతో ప్రాధాన్యం ఉంది. ఈ రోజు ( సోమవారం, జనవరి 13, 2025 ) భోగి సందర్భంగా ఈ పండుగ విశేషాలు.

"దక్షిణాయనానికి, ధనుర్మాసానికి చివరి రోజు భోగి. ఇళ్లలోకి భోగభాగ్యాలను ఆహ్వానించే రోజు ఇది. రైతులు ఆరుగాలం కష్టించి పండించిన పంటలు ఇంటికి చేరే రోజు. రైతులతోపాటు అందరి ముఖాల్లో నవ్వులు పూసే రోజు. భోగి అంటే 'తొలినాడు' అని ఒక అర్థం ఉంది. కొత్త సంవత్సరంలో పండుగలు భోగితోనే మొదలవుతాయి. ఈ రోజున ఇంటి ముందు భోగి మంట వేస్తే ఇంట్లోని చెడు, దరిద్రాన్ని తొలగించుకున్నట్లే అని నమ్మకం.




**పురాణాల ప్రకారం**

భోగి పండుగ వెనుక కొన్ని పురాణ గాథలు ప్రచారంలో ఉన్నాయి. ఇది ధనుర్మాసం చివరి రోజు. ఈ నెలంతా విష్ణుమూర్తి దేవాలయాల్లో ధనుర్మాసోత్సవాలు జరుగుతాయనే సంగతి తెలిసిందే. దీనికీ, భోగి పండుగకు సంబంధం ఉంది. విష్ణుచిత్తుని కుమార్తె గోదాదేవి. ఆమెకు వివాహం చేయాలనుకుంటాడు విష్ణుచిత్తుడు. అయితే తాను శ్రీరంగంలో ఉన్న శ్రీరంగనాయకులను తప్ప మరెవరినీ వివాహం చేసుకోనని తండ్రితో చెప్పింది. ఈ కోరిక తీరడం కోసం ధనుర్మాస వ్రతం చేసి, నెల రోజులపాటు పొంగలి మాత్రమే ఆహారంగా తీసుకుందట. అదే సమయంలో రచించిన కృతులను స్వామికి అర్పించింది.

వ్రతం పూర్తవగానే స్వామి ప్రత్యక్షమై ఆమెను వివాహం చేసుకుంటానని శ్రీరంగం రమ్మని ఆదేశిస్తాడు. ఆమెకు సమస్త భోగాలను సమకూరుస్తానని వరం ఇస్తాడు. విష్ణుచిత్తుడు ప్రజలందరి సమక్షంలో వారి వివాహం జరిపిస్తాడు. వివాహం పూర్తికాగానే గోదాదేవి గర్భాలయంలోకి వెళ్లి, స్వామివారి పక్కన కూర్చొని, స్వామివారిలో ఐక్యమవుతుంది. ఈ తంతు జరిగిన రోజు భోగి, గోదాదేవిలాగే అందరికీ భోగభాగ్యాలు ఇచ్చే రోజు కాబట్టి ఇది భోగి పండుగ అయ్యిందని ఒక కథ ప్రచారంలో ఉంది.

**లౌకిక రూపం**

పురాణాల నుంచి పుట్టిన పండుగలైనప్పటికీ, వాటికి ఒక సైంటిఫిక్ కోణం ఉండటం మన కల్చర్ గొప్పదనం. ప్రతి పౌరాణిక పండుగ ఒక లౌకిక రూపం సంతరించుకుంటూ, అందరికీ ఆనందకరమైన రోజుగా మారుతుంది. అంటే ప్రజలందరూ జరుపుకునే సంప్రదాయాలు పండుగలో చేరుతుంటాయి. అలా వచ్చినవేభోగి పండుగ రోజు మంటలు వేయడం, చిన్న పిల్లలకు భోగి పళ్లు పోయడం. భోగి పండుగ రోజు సూర్యోదయానికి ముందే ఇళ్ల ముందు భోగి మంటలు వేస్తారు. ఆవు పేడతో చేసిన పిడకలు, మామిడి, రావి, మేడి చెట్ల నుంచి వచ్చిన కలప, తాటాకులు, పంటలు కోసిన తర్వాత వచ్చిన గడ్డి వంటివి వేసి భోగి మంటలు వేస్తారు. ఇంట్లోని పాత వస్తువుల్ని కూడా మంటల్లో వేస్తుంటారు. దీనివల్ల ఇంట్లో ఉన్న పనికిరాని వస్తువులు తొలగిపోతాయి. ఇంట్లో అవసరంలేని వస్తువుల్ని బయటపడేసినట్లుగానే, మనలో పనికిరాని చెడు ఆలోచనల్ని, బాధల్ని కూడా ఇలాగే చేయాలని దీనిలోని అంతరార్థం..

**నలుగు స్నానం**

భోగి రోజు ఆచరించాల్సిన మరోసంప్రదాయం నలుగుస్నానం.భోగి మంటలు అయిపోగానే, ఒంటికి నువ్వుల నూనె పట్టించి మర్దన చేసుకోవాలి. తర్వాత కుంకుడు కాయ రసంతో స్నానం చేయాలి. రసాయనాలు వాడకుండా సహజసిద్ధ పదార్థాలతో స్నానం చేస్తే ఒంటిపై ఉన్న మలినాలన్నీ తొలగిపోతాయి. శరీరం కొత్త తేజస్సును, శక్తిని పొందుతుంది.

**భోగి పళ్లు**

చాలా మందికి భోగి అనగానే గుర్తొచ్చేది భోగ పళ్లు. పన్నెండేళ్లలోపు పిల్లల తలపై నుంచి పండ్లు పోయడం ఈ సంప్రదాయం. రేగి పండ్లు, జీడిపండ్లు, చెరుకు ముక్కలు, కొన్ని నాణేలు పిల్లల తలపై నుంచి పోస్తారు. చాప లేదా దుప్పటి పై, తూర్పు అభిముఖంగా కూర్చోబెట్టి ఇలా చేయాలి. రేగి పండ్లను శ్రీమన్నారాయణ స్వామి ప్రతిరూపంగా బావిస్తారు. వీటిని తలపై పోస్తే శ్రీ లక్ష్మీ నారాయణుల ఆశీస్సులు పిల్లలకు ఉంటాయని నమ్మకం. పురాణాల ప్రకారం శివుడికోసం నరనారాయణులు బదరికావనంలో తపస్సు చేస్తారు. అప్పుడు దేవతలు వాళ్ల తపస్సుకు మెచ్చి, నరనారాయణుల తలలపై బదర్ ఫలాలు కురిపించారని చెప్తారు. అందుకే. ఈ కార్యక్రమం పురాణకాలం నుంచి వస్తున్న ఆచారమని ఎక్కువమంది నమ్ముతారు. 12 ఏళ్ల లోపు వయసున్న చిన్నారులకు మాత్రమే అంటే యుక్త వయసులోకి రాని పిల్లలకు మాత్రమే ఇలా భోగిపండ్లు పోస్తారు.

**బొమ్మల కొలువు**

కొన్ని ప్రాంతాల్లో భోగి రోజు బొమ్మల కొలువు కూడా ఏర్పాటు చేస్తారు. సాయంత్రం పూట పిల్లలు తమ ఇంట్లోని బొమ్మలన్నింటినీ ఒక చోట పెట్టి పూజిస్తారు. కొన్ని ప్రాంతాల్లో భోగి రోజు రైతులు తమ సాగుభూమికి ఆనవాయితీగా కొన్ని నీళ్లు పారించి తడి చేస్తారు. ఒక పంట పూర్తయ్యాక మరో పంట కోసం నీళ్లు పారించడాన్ని పులకేయడం అంటారు. అంటే ఇది 'భోగి పులక అని అర్థం.

**పులగం**

ఈ రోజు ప్రత్యేకంగా పులగం అనే వంటకం చేసుకుంటారు. ఇది ఆరోగ్యపరంగానూ మేలైనది. చలి మంచి ఒంటిని రక్షించి వెచ్చదనాన్ని అందించే లక్షణం ఈ వంటలో ఉంది. పైగా జీర్ణశక్తిని కూడా పెంచుతుంది. అందుకే చాలా మంది భోగి రోజు పులగం తప్పనిసరిగా తినాలి అంటుంటారు. మనం తరచుగా వాడే కలగా పులగం అనే మాట దీని నుంచే వచ్చింది.

భోగి రోజు లక్ష్మీదేవిని కూడా కొలుస్తారు. ధాన్యలక్ష్మికి కట్టు పొంగలి చేసి నైవేద్యంగా పెడతారు. రాగులు, జొన్నలు పండే ప్రాంతాల్లో వాటితో ప్రత్యేకంగా రొట్టెలు చేసి అమ్మవారికి సమర్పిస్తారు. భోగిరోజు పెళ్లికాని అమ్మాయిలు పాలతో పొంగలి చేసి లక్ష్మీదేవికి ప్రసాదంగా పెడితే వివాహం అవుతుందని నమ్ముతారు.

# గోల్డ్ ప్రియులకు షాక్..కొనేటట్టు లేదు.. 80వేల మార్క్ దాటిన బంగారం ధరలు..

**హైదరాబాద్ పెన్ పవర్:**బంగారం ధరలు మరోసారి 80వేల మార్క్ ను తాకింది. సోమవారం( జనవరి13, 2025)న 470 రూపాయలు పెరిగి రూ. 80వేలకు చేరింది. హైదరాబాద్ తో పాటు దేశమంతా బంగారం వెండి ధరలు పెరిగాయి. గత వారం రోజులు హెచ్చు తగ్గులను చూస్తున్న పసిడి ధరలు. గత రెండు రోజులగా పెరుగుతూ వస్తోంది. అంతర్జాతీయ మార్కెట్లో సంక్షోభం..సేఫ్టీ ఇన్వెస్ట్ మెంట్ మెటల్ కావడంతో బంగారం ధరలు ఆల్ టైమ్ హైకి చేరాయి. సోమవారం నాడు హైదరాబాద్‌లో 10 గ్రాముల 22 క్యారెట్ల బంగారం ధర రూ.73,400గా ఉండగా..24 క్యారెట్ల బంగారం ధర రూ.80,070కి చేరుకుంది. నిన్న ఆదివారం 22 క్యారెట్ల 10గ్రాముల బంగారం ధర రూ. 73వేలు ఉండగా.. 400 రూపాయలు పెరిగి.. 73వేల 400లకు చేరింది.. అదే 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.79వేల 640 ఉండగా.. 430 రూపాయలు పెరిగి రూ. 80వేల 0740కి పెరిగింది. జనవరి నెల ప్రారంభంతో పోలిస్తే 22 క్యారెట్ల బంగారం, 24 క్యారెట్ల బంగారం ధరలు 2.65 శాతం పెరుగుదల కనిపిస్తుంది. జనవరి ప్రారంభంలో 22 క్యారెట్ల బంగారం ధర రూ.71వేల 500 కాగా..24 క్యారెట్ల బంగారం ధర రూ.78వేలుగా ఉంది. సోమవారం 22 క్యారెట్ల బంగారం ధరలు రూ. 400 లు పెరగ్గా.. 24 క్యారెట్ల బంగారంపై రూ. 430 లు పెరిగాయి. దీంతో హైదరాబాద్ నగరంలో బంగారం ధరలు ఆల్ టైమ్ గరిష్ట స్థాయికి చేరాయి.



# మహా కుంభమేళా 2025 : 12 ఏండ్లకు ఒకసారే ఎందుకు..? సూర్య, చంద్రుడు ఒకే రాశిలోకి వచ్చినప్పుడే ఇలా..!

## ప్రయాగ్ రాజ్ మహాకుంభ్




**హైదరాబాద్ పెన్ పవర్:** ఉత్తర ప్రదేశ్ లోని త్రివేణి సంగమ క్షేత్రమైన ప్రయాగ్ రాజ్ లో ఈ సారి కుంభ మేళా జరగనుంది. మాఘమాసంలో బృహస్పతి మేషరాశిలో.. సూర్యుడు, చంద్రులు మకరరాశిలో ఉన్నప్పుడు ప్రయాగ్ రాజ్ లో కుంభమేళా మొదలవుతుంది. గంగా, యమున, సరస్వతి నదులు కలిసే చోట జరిగే ఈ వేడుకకు 40 కోట్ల మంది హాజరవుతారని ప్రభుత్వం భావిస్తోంది. ఇందుకోసం ఘనంగా ఏర్పాట్లు చేస్తోంది.
ప్రపంచం నలుమూలల నుంచి భక్తులు, అఘోరాలు, నాగసాధులు, సాధువులు, పీఠాధిపతులు ఇక్కడ పుణ్యస్నానాల కోసం తరలివస్తారు. ఈ సందర్భంగా జలమంతా జనంతో నిండిపోతుంది. భక్తులు పుణ్యస్నానాలు ఆచరించేందుకు వీలుగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనేక ఏర్పాట్లు చేస్తున్నాయి. అధునాతన టెక్నాలజీని వినియోగించుకుంటున్నాయి.
ప్రయాగ్ రాజ్ లో త్రివేణి సంగమం వెంబడి ఉన్న ప్రాంతం మొత్తాన్ని ఒక ప్రత్యేక జిల్లాగా గుర్తించి అధికార యంత్రాంగాన్ని ఏర్పాటు చేసింది. ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ ఎప్పటికప్పుడు సమీక్షలు నిర్వహిస్తున్నారు. అఘోరాలు, నాగసాధులకు ఉపదేశం చేసి వారికి యోగా విద్యలు నేర్పేందుకు ఉద్దేశించిన అఖాడాలు ప్రయాగరాజ్ కు తరలివస్తాయి. ఈ సారి 13 అఖాడాలు ప్రత్యేకంగా ఇక్కడ బస చేయనున్నాయి. కుంభమేళాను ప్రతి 12 ఏళ్లకే జరుపుకుంటారు. అయితే 12 ఏళ్లకే ఎందుకు చేస్తారనే సందేహం సహజం. ఇందుకు ఓ పురాణగాథ ఉందని భక్తుల నమ్మకం. అమృతం కోసం దేవతలు, రాక్షసులు పాల సముద్రాన్ని చిలికినప్పుడు అందులో నుంచి అమృతం బయటకు వచ్చింది. అమృతం తమకే దక్కాలని దేవతలు, రాక్షసులు 12 రోజులపాటు యుద్ధం చేసుకున్నారట. ఆ 12 రోజులే భూలోకంలో 12 సంవత్సరాలని నమ్మకం.
అలాగే యుద్ధం సమయంలో అమృతం ఉన్న పాత్ర నుంచి 12 చుక్కలు కిందకి పడ్డాయని.. అందులో 4 చుక్కలు పలు ప్రదేశాల్లో భూమిమీదకు చేరాయని నమ్ముతారు. అందుకే ఆ ప్రదేశాల్లో కుంభమేళా నిర్వహిస్తున్నారు. ఇక గురు గ్రహం 12 ఏళ్ల 12 రాశుల్లో ఉంటాడు కనుక 12 ఏళ్లకు ఒసారి కుంభమేళా చేస్తారని మరో కథ ప్రచారంలో ఉంది.

**సాగర మథనం స్ఫూర్తిగా లోగో**
రాబోయే మహా కుంభమేళాను దృష్టిలో ఉంచుకుని యూపీ యోగి ఆదిత్యానాథ్ ప్రయాగ్ రాజ్ లో లోగోను విడుదల చేశారు. సాగర మథనంలో ఉద్భవించిన అమృత కలశాన్ని లోగోలో ఉంచారు. అలాగే పవిత్ర ప్రయాగ్ రాజ్ సంగమ ప్రదేశాన్ని, హనుమంతుని చిత్రం, ఆలయం, అక్షయవత్ వృక్షం, ప్రకృతికి, మానవులకు మధ్య సంబంధం తెలిపే సనాతన ధర్మానికి సంబంధించిన చిత్రాలను ఇందులో చూడొచ్చు. ప్రజా సంక్షేమం, స్వయం అవగాహన వంటి అంశాలకు మహాకుంభ్ మేళా 2025 లోగో చిహ్నాంగా నిలుస్తోంది.

**కుంభమేళా ఓ కొత్త జిల్లా**
ప్రయాగ్ రాజ్ లో కుంభమేళా జరిగే ప్రదేశాన్ని అంతా కలుపుతూ ఓ జిల్లాను ఏర్పాటు చేసింది యూపీ ప్రభుత్వం. ఆ జిల్లాకు 'మహా కుంభమేళా' అని అధికారికంగా పేరును ప్రకటించింది. దీంతో రాష్ట్రంలో జిల్లాల సంఖ్య 76కి చేరింది. మతపరంగా జరుగుతున్న ఈ వేడుకలో యాత్రికులకు తగిన ఏర్పాట్లు, భద్రతను కల్పించేందుకుగాను ఈ జిల్లాను ఏర్పాటు చేస్తున్నట్లు అధికారులు తెలిపారు. అందువల్ల వారికి మెరుగైన సౌకర్యాలు అందుతాయని వెల్లడించారు.

# కాగజ్ నగర్ అడవుల్లో రాబందుల సంరక్షణ కేంద్రం..మహారాష్ట్ర నుంచి తెచ్చేందుకు కసరత్తు




**హైదరాబాద్ పెన్ పవర్:** కుమ్రం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా కాగజ్ నగర్ అడవుల్లో రాబందుల ఆవాసంగా ఉన్న పాలరాపు గుట్టను 'జటాయు సంరక్షణ' కేంద్రంగా అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం నిర్ణయించింది. గతంలో పెంచికల్‌పేట రేంజ్ పరిధిలోని ప్రాణహిత, పెద్దవాగు సంగమ తీరాన 300 మీటర్ల ఎత్తులో ఉన్న పాలరాపు గుట్ట ఒకప్పుడు రాబందులు ఆవాసంగా ఏర్పాటు చేసుకున్నాయి. ఈ గుట్టపై 30 వరకు రాబందులు ఉండేవి. వీటి ఉనికిని గుర్తించిన అధికారులు సంరక్షణ చర్యలు చేపట్టారు. రెండ్రోజులకు ఒకసారి పాలరాపుగుట్ట వద్ద ఓ పశు కళేబరాన్ని రాబందులకు ఆహారంగా అందించారు. ఈ క్రమంలో వాటి సంతతి కూడా పెరిగింది. అయితే, మధ్యలో ఇవి కనుమరుగైపోయాయి. పొరుగున ఉన్న మహారాష్ట్రకు వలస పోయాయని భావించారు. కానీ ఇటీవల మళ్లీ పాలరాపు గుట్టపై రాబందులు సంచరించడంతో సంరక్షణకు చర్యలు చేపట్టారు. ప్రాణహితకు అవలివైపు ఉన్న కమలాపూర్ అడవి నుంచి రాబందులు రాపోకలు సాగిస్తున్నాయని, అక్కడ అడవిలో మరో ఆవాసం ఏర్పాటు చేసుకున్నట్లు ఫారెస్ట్ ఆఫీసర్లు గుర్తించారు. తిరిగి పాలరాపుగుట్టకు పూర్వవైభవం తీసుకొచ్చేందుకు టూరిజం డెవలప్ మెంట్‌లో భాగంగా రూ.2.5 కోట్లతో రాబందుల సంరక్షణ కేంద్రాన్ని ఏర్పాటు చేయబోతున్నారు. మనుషుల రాకపోకలు పెరిగిపోవడం, అడవిలో తరచూ అగ్నిప్రమాదాలు జరుగుతుండటం, సరైన ఆహారం లభించకపోవడంతో రాబందులకు సురక్షిత ప్రాంతం కాదని భావించి వలసపోతున్నాయని వన్యప్రాణి సంరక్షకులు పేర్కొంటున్నారు

**అంతరించిపోవడానికి డైక్లోఫినాక్ కారణం**
పశువులు చనిపోయినప్పుడు బ్యాక్టీరియా, వైరస్ వ్యాపిస్తుంది. మరణించిన జంతువుల కళేబరాలను తింటూ రాబందులు వ్యాధుల వ్యాప్తిని అడ్డుకుంటూ పరోక్షంగా మనుషులకు మేలు చేస్తున్నాయి. ప్రకృతి సమతుల్యతను కాపాడుతున్నాయి. కాలక్రమంలో ఈ పక్షుల సంఖ్య గణనీయంగా తగ్గిపోయింది. మన రాష్ట్రంలో వీటి ఉనికి కనుమరుగయ్యే పరిస్థితి ఏర్పడింది. రాబందుల సంఖ్య తగ్గిపోవడానికి పశువులకు వాడే డైక్లోఫినాక్ ఔషధమే కారణమని భావించిన కేంద్రం.. దీనిపై నిషేధం విధించింది. పశువులకు జ్వరం వచ్చినప్పుడు, ఇతర వ్యాధులు సంక్రమించినప్పుడు డైక్లోఫినాక్ ఇంజక్షన్‌ను వినియోగించేవారు. ఈ క్రమంలో మరణించిన పశువుల కళేబరాలు, మాంసం తిని రాబందులు మృత్యువాత పడుతున్నాయి. ఈ విషయాన్ని గుర్తించి ఈ ఔషధంపై కేంద్రం పూర్తిగా నిషేధం విధించింది. మెడికల్ షాపుల్లోనూ ఈ ఔషధం విక్రయించకుండా చర్యలు చేపట్టింది. డైక్లోఫినాక్ ప్రత్యామ్నాయంగా పశువులకు ఉపయోగిస్తున్న పలు ఔషధాలు సైతం రాబందుల ఉనికికి ప్రమాదకరమని గుర్తించి, వాటిని కేంద్రం నిషేధిత జాబితాలో చేర్చింది. ఈ ఔషధం వాడకుండా వెటర్నరీ డాక్టర్లకు అవగాహన కల్పిస్తున్నారు. రాబందుల సంరక్షణ మనవాళి బాధ్యత, వాటిని కాపాడుకుంటేనే వైరస్‌లు సోకవని వన్యప్రాణి సంరక్షణ అధికారులు పేర్కొంటున్నారు.

**మహారాష్ట్ర నుంచి తెచ్చేందుకు కసరత్తు**
రాష్ట్రంలో రాబందుల సంతతిని పెంచడం కోసం ఇతర ప్రాంతాల నుంచి రాబందుల జంటలను నెహ్రూ జూపార్క్ తీసుకొచ్చి సంతానోత్పత్తి పెంచనున్నారు. వన్యప్రాణి సంరక్షణ విభాగం రాబందుల సంరక్షణకు చర్యలు చేపడుతుండగా.. దీనికి సెంట్రల్ జూ అథారిటీ నిధులు సమకూరుస్తోంది. ఇందులో భాగంగా మహారాష్ట్ర నుంచి రాబందులను తీసుకొచ్చేందుకు కసరత్తు చేస్తున్నారు. రాబందు జీవిత కాలం 40- నుంచి 45 ఏండ్లు మాత్రమే కావడంతో 15 నుంచి 20 ఏండ్ల మధ్య వయస్సు ఉన్న వాటిని తీసుకురావాలని భావిస్తున్నారు.

# రామప్పకు ఆరు కిలోమీటర్ల దూరంలో బొగ్గు గనులు



**హైదరాబాద్ పెన్ పవర్:** ములుగు జిల్లా వెంకటాపూర్ మండలంలోని పాలంపేట గ్రామంలో రామప్ప ఆలయం ఉంది. ఇక్కడికి ఆరు కిలోమీటర్ల దూరంలో వెంకటాపూర్ గ్రామ శివారులో 40.43 మిలియన్ టన్నుల బొగ్గు నిక్షేపాలు ఉన్నట్లు సింగరేణి సంస్థ గుర్తించింది. అన్ని రకాల సర్వేలు జరిపి 19 ఏండ్ల పాటు బొగ్గు తవ్వకాలు జరపాలని పర్మిషన్ల తీసుకుంది. 314 హెక్టార్ల అటవీ భూములు, 1,480 హెక్టార్ల వ్యవసాయ, ప్రభుత్వ అసైన్డ్ భూములను సేకరించాలని రిపోర్ట్ తయారు చేసింది. గతంలోనే కొంత భూమిని సేకరించి హద్దులు కూడా నిర్ణయించారు. రైతులకు పరిహారం అందించి, ఆర్అండ్ఆర్ ప్యాకేజీ వర్తింపచేసి 2021 డిసెంబర్‌లోనే తవ్వకాలు ప్రారంభించాలని మొదట భావించారు. అయితే రామప్ప దేవాలయానికి 2021 జూలై 25 యునెస్కో గుర్తింపు వచ్చింది. విదేశీ పర్యాటకుల సంఖ్య పెరిగే అవకాశం ఉండడంతో ప్రజల నుంచి తీవ్ర వ్యతిరేకత వచ్చింది. దీంతో సింగరేణి ఆఫీసర్లు సర్వే పనులు ఆపేసి రైతులతో మీటింగ్‌లకు రద్దు చేసుకోవడమే కాకుండా నష్టపరిహారం డబ్బులు కూడా రిలీజ్ చేయలేదు.

**ఓపెన్ కాస్ట్‌కు అనుకూలంగా సర్వే రిపోర్ట్**
వెంకటాపూర్‌లో ఓపెన్ కాస్ట్ ఏర్పాటు చేయకుండా అభ్యంతరాలు రావడంతో సింగరేణి మూడేండ్లుగా వివిధ సంస్థలతో సర్వే చేయించింది. ఇక్కడ ఓపెన్ కాస్ట్ ఏర్పాటు చేసి బాంబ్ బ్లాస్టింగ్‌లు జరిపినా రామప్ప టెంపుల్‌తో పాటు చెరువుకు ఎలాంటి ఇబ్బంది ఉండదని ఐఐటీ మద్రాస్, ఎన్‌జీఆర్ఐ సర్వే బృందాలు చెప్పినట్లు సింగరేణి ఆఫీసర్లు చెబుతున్నారు.
ప్రతి కిలోమీటర్‌కు ఒక స్టేషన్ ఏర్పాటు చేసి టెస్ట్‌లు చేశామని, ఐదు కిలోమీటర్ల వరకు ఎటువంటి తీవ్రత లేదని, సైంటిఫిక్ రీసెర్చ్ వైబ్రేషన్స్ జీరోగా వచ్చాయని అంటున్నారు. ఎన్ఐటీ సూరత్, ఐఐటీ మద్రాస్ ఇప్పటివరకు నాలుగు రకాల సైంటిఫిక్ స్టడీస్ చేసి బ్లాస్టింగ్ ఎఫెక్ట్ లేదని తేల్చిందన్నారు. ఎయిర్ పొల్యూషన్‌పై నాగ్‌పూర్‌కు చెందిన నేషనల్ ఎన్విరాన్‌మెంట్ ఇంజినీరింగ్ బృందం ఇటీవల రీసెర్చ్ చేసిందన్నారు.
రామప్ప టెంపుల్ 3.3 హెడ్జ్ ఫ్రీక్వెన్సీని తట్టుకుంటుందని, సింగరేణి ఓపెన్ కాస్ట్ బ్లాస్టింగ్ తీవ్రత ఓసీ నుంచి ఐదు కిలోమీటర్ల వరకు 0.01హెడ్జ్‌గానే ఉన్నట్లు రీసెర్చ్‌లో తేలిందన్నారు. ప్రస్తుతం భూపాలపల్లి ఏరియాలో నడుస్తున్న కేటీకే ఓసీ %-%3కి ఆరు కిలోమీటర్ల దూరంలోనే ఘనపురం చెరువు, ఐదు కిలోమీటర్ల దూరంలో కోటగుళ్లు ఉన్నాయని, మూడేండ్లుగా ఓసీ నడుస్తున్నా ఎలాంటి కంప్లైంట్స్ లేవని సింగరేణి ఆఫీసర్లు చెబుతున్నారు.

# దేశంలోనే హైదరాబాద్ ఫస్ట్..నాంపల్లిలో 10 అంతస్థుల్లో 250 కార్లు..200 బైక్ లు పార్కింగ్




**హైదరాబాద్ పెన్ పవర్:**హైదరాబాద్ నాంపల్లిలో వాహనదారులకు పార్కింగ్ తిప్పలు త్వరలో తప్పనున్నాయి. ఆ ప్రాంతంలో నిర్మిస్తున్న అధునాతన మల్టీ లెవల్ పార్కింగ్ కాంప్లెక్స్ మరో నెలరోజుల్లోనే అందుబాటులోకి రానుంది. దీనికి సంబంధించిన పనులు తుది దశకు చేరుకున్నాయి. ఫిబ్రవరి మొదటి వారంలోపు పూర్తి చేసేలా పనుల్లో వేగం పెంచారు. ఈ పార్కింగ్ కాంప్లెక్స్ ను సీఎం రేవంత్ రెడ్డి చేతులు మీదుగా ప్రారంభించేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నట్టు తెలుస్తోంది. కొద్ది రోజుల్లో ట్రయల్స్ కూడా చేయనున్నారు. ఇది అందుబాటులోకి వస్తే నాంపల్లి ప్రాంతంలో టూవీలర్, ఫోర్ వీలర్ పార్కింగ్ ఇక్కట్లు తప్పనున్నాయి. ముఖ్యంగా నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్స్ లో జరిగే నుమాయిష్ లాంటి కార్యక్రమాలకు వచ్చే సందర్శకులు పార్కింగ్ కోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అలాగే, ఏదైనా పబ్లిక్ మీటింగ్ జరిగినప్పుడు, ఇతర పనుల మీద ఆ ప్రాంతానికి వచ్చినప్పుడు కూడా వాహనదారులు పార్కింగ్ ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఆ సమస్యలన్నిటికీ ఈ పార్కింగ్ కాంప్లెక్స్ చెక్‌పెట్టనుంది. నాంపల్లి మెట్రో స్టేషన్ సమీపంలో హైదరాబాద్ మెట్రో రైల్ లిమిటెడ్ (హెచ్ఎమ్ఆర్ఎల్)కు ఉన్న అర ఎకరం స్థలంలో పీపీపీ పద్ధతిలో రూ.90 కోట్ల వ్యయంతో ఈ కాంప్లెక్స్ ను15 అంతస్తుల్లో నిర్మిస్తున్నారు. ఈ పార్కింగ్ కాంప్లెక్స్ కు 2018లోనే శంకుస్థాపన జరిగినా.. గత ప్రభుత్వ హయాంలో పనులు స్లోగా నడిచాయి. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక సీఎం రేవంత్ రెడ్డి ఇలాంటి పెండింగ్ ప్రాజెక్టులపై ప్రత్యేకంగా దృష్టి పెట్టడంతో పనులు ఊపందుకున్నాయి.

**తక్కువ స్థలంలో ఎక్కువ కార్లు పట్టేలా..**

నాంపల్లిలో చేపట్టిన ఈ కంప్యూటరైజ్డ్ మల్టీ లెవల్ పార్కింగ్(ఎంఎల్పీ)ను ఢిల్లీకి చెందిన ప్రైవేట్ సంస్థ డెవలప్ చేస్తున్నది. దేశంలోనే జర్మన్ టెక్నాలజీతో నిర్మిస్తున్న తొలి మల్టీ లెవల్ పార్కింగ్ ఇదే కావడం విశేషం. ఇందులో మొత్తం 15 అంతస్తులు ఉండగా.. 10 అంతస్తుల్లో పార్కింగ్ ఏర్పాట్లు చేస్తున్నారు. మిగతా ఐదు అంతస్తుల్లో రెండు సినిమా స్క్రీన్లతో ఒక థియేటర్, రెస్టారెంట్లు కూడా అందుబాటులోకి తెస్తున్నారు. మొత్తం1,44,400 చదరపు అడుగుల్లో భవన నిర్మాణం ఉండగా, అందులో 68 శాతం పార్కింగ్ కోసం, మిగతా 32 శాతం కమర్షియల్ అవసరాల కోసం వినియోగించనున్నారు. 68 శాతం స్థలంలో 250 కార్లు, 200 బైకులు పార్కింగ్ చేసే వీలుండేలా నిర్మించారు. చార్జీలు కారుకు గంటకు రూ. 30, బైకుకు గంటకు రూ. 10 చొప్పున వసూలు చేయనున్నట్టు సమాచారం. అయితే, ముంబై, ఇతర పలు ప్రధాన నగరాల్లోనూ మల్టీ లెవల్ పార్కింగ్ లు ఉన్నా.. అక్కడ తరచూ సమస్యలు వస్తున్నాయి.

**నిమిషంలోనే పార్కింగ్..**

మల్టీ లెవల్ పార్కింగ్ కాంప్లెక్స్ లో బీ1, బీ2, బీ3 అండర్ గ్రౌండ్ అంతస్తులతోపాటు 5 నుంచి 11 అంతస్తుల వరకు పార్కింగ్ కోసం కేటాయించారు. మూడో అంతస్తులో రెండు స్క్రీన్లతో ఒక థియేటర్, రెస్టారెంట్లు ఇతర కమర్షియల్ నిర్మాణాలు చేపడుతున్నారు. గ్రౌండ్ ఫ్లోర్‌లో పార్కింగ్ కు సంబంధించి నాలుగు ఎంట్రీ, ఎగ్జిట్ టెర్మినల్స్ ఉంటాయి. ఆ టెర్మినల్స్ వద్ద ఉన్న టర్న్ టేబుల్స్ పై వాహనాలను వదిలితే. లిఫ్టుల ద్వారా నిర్ణీత అంతస్తులోకి చేరుకుంటాయి. సైజును బట్టి తగిన స్లాట్లలో పార్కింగ్ చేస్తారు. పార్కింగ్ ప్రక్రియకు కేవలం ఒక్క నిమిషం మాత్రమే పట్టనుంది. కార్లను తిరిగి తీసుకోవడానికి టర్న్ టేబుల్స్ వద్దనున్న కార్డు రీడర్ల వద్ద స్మార్ట్ కార్డును స్వైప్ చేస్తే.. కారు నిర్ణీత టర్న్ టేబుల్ వద్దకు చేరుకుంటుంది. టర్న్ టేబుల్ పై ఉన్న కారును రివర్స్ చేసే బాధ లేకుండా టర్న్ టేబుల్స్ వాహనాన్ని కావాల్సిన దిక్కుకు రొటేట్ చేస్తాయి. దీంతో పార్కింగ్ నుంచి కారును రెండు నిమిషాల్లోనే బయటకు తీసేందుకు వీలుకానుంది. ఇక పార్కింగ్ చార్జీలు చెల్లించేందుకు స్మార్ట్ కార్డులను ఉపయోగించాల్సి ఉంటుంది. రెగ్యులర్ గా పార్కింగ్ చేసేవారికి ఆర్ఎఫ్ఐడీ స్మార్ట్ కార్డులను జారీ చేస్తారు. ఈ కాంప్లెక్స్ నిర్మాణంలో మెట్రో ఎండీ ఎన్వీఎస్ రెడ్డి ప్రత్యేకంగా ఫోకస్ పెట్టినట్టు చెప్తున్నారు.

# ఖమ్మం పోలీసుల సూపర్ ఐడియా: కోడిపందాల స్థావరాలు పసిగట్టేందుకు డ్రోన్ కెమెరాలు..



**హైదరాబాద్ పెన్ పవర్:**సంక్రాంతి అంటే ముత్యాల ముగ్గులు, పిండి వంటలు, పతంగులు, గంగిరెద్దులు, హరిదాసులు, పట్నం నుండి పల్లెకు వచ్చిన జనంతో కోలాహలంగా ఉంటుంది. ఇదంతా నాణేనికి ఒక వైపు అయితే.. కోడి పందాలు, పేకాట మరో వైపు అని చెప్పాలి. సంక్రాంతి పండుగ మూడురోజుల్లో తెలుగు రాష్ట్రాల్లో కోడిపందాలు, పేకాట స్థావరాల వద్ద కొన్ని కోట్ల రూపాయలు చేతులు మారుతాయి. అనుమతి లేకుండా నిర్వహించే కోడిపందాలు అరికట్టేందుకు పోలీసులు ఎన్ని చర్యలు తీసుకుంటున్నా కూడా పందెం రాయుళ్లు పోలీసుల కళ్లుగప్పి కోడిపందాలు కోడిపందాలు నిర్వహిస్తూనే ఉంటారు.. ఈ క్రమంలో ఖమ్మం పోలీసులు కోడిపందాలను అరికట్టేందుకు డ్రోన్ కెమెరాలు వాడాలన్న వినూత్న ఐడియాతో ముందుకొచ్చారు. సంక్రాంతి పండుగ నేపథ్యంలో కోడి పందాలను నివారించే దిశగా చర్యలు చేపట్టారు ఖమ్మం పోలీసులు. జిల్లా సరిహద్దులో టాస్క్ ఫోర్స్ బృందాలు మూడు డ్రోన్ కెమెరాలు వినియోగిస్తున్నట్లు తెలిపారు. కోడిపందాలను నియంత్రించేందుకు డివిజన్, మండల, గ్రామస్థాయిలో టీంలను ఏర్పాటు చేశామని.. కోడిపందాలు నిలువరించేలా పకడ్బంధీగా ప్రణాళికలు రూపొందించామని తెలిపారు పోలీసులు.ఖమ్మం కమిషనరేట్ పరిధిలో కోడిపందాలు, జూదం జరుగుతున్నాయని సమాచారం అందిన వెంటనే అక్కడకు వెళ్లి తగిన చర్యలు తీసుకునేలా ఆదేశించారు కమీషనర్. కోడిపందాలు, జూదం నిర్వహణకు తోటలు, భూములు, గెస్ట్ హౌస్ లు ఇచ్చి ప్రోత్సహించే వారిపై కూడా కేసులు నమోదు చేయాలని ఆదేశించారు. డ్రోన్ కెమెరాల ద్వారా కోడి పందెలు, బెట్టింగ్, పేకాట శిబిరాలపై దాడులు చేసి కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు పోలీసులు. గత సంవత్సరంలో కోడిపందేలు నిర్వహించిన వారిని, కత్తులు కట్టే వారిని గుర్తించి బైండోవర్ కేసులు నమోదు చేశామని... కోడిపందేల నిర్వహణ నిషేధంపై గ్రామాల్లో ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు పోలీసులు.

## హైదరాబాద్ లో కమ్ముకున్న కారు మబ్బులు.. తగ్గిన ఉష్ణోగ్రతలు.. జనవరి 16 దాకా ఇదే పరిస్థితి..




**హైదరాబాద్ పెన్ పవర్:** హైదరాబాద్ లో కారు మబ్బులు కమ్ముకున్నాయి.. సోమవారం ( జనవరి 13, 2025 ) ఉదయం ఆకాశంలో మబ్బులు కమ్ముకోవడంతో తెల్లవారినా కూడా చీకటిగానే ఉంది. ఇదిలా ఉండగా హైదరాబాద్ తో పాటు తెలంగాణలోని పలు చోట్ల ఉష్ణోగ్రతలు తగ్గుముఖం పట్టాయి. రానున్న మూడురోజులు ఇదే పరిస్థితి ఉంటుందని.. ఉదయం పుట పొగమంచు ఎక్కువగా ఉండే అవకాశం ఉందని తెలిపింది వాతావరణ శాఖ. ఆదివారం హైదరాబాద్ లో కనిష్ఠంగా 15 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత నమోదైనట్లు తెలిపింది వాతావరణ శాఖ.తెలంగాణలోని పలు జిల్లాలో ఉష్ణోగ్రతలు 15 డిగ్రీల సెల్సియస్ కంటే తక్కువ నమోదయ్యాయని.. రానున్న మూడు రోజుల్లో వివిధ ప్రాంతాల్లో 11 డిగ్రీల కంటే తక్కువ ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉందని తెలిపింది వాతావరణ శాఖ. ఆదిలాబాద్, కొమరం భీమ్, మంచిర్యాలు, మెదక్, నిర్మల్, సంగారెడ్డి, వికారాబాద్‌లలో ఈ ఉష్ణోగ్రత నమోదయ్యే అవకాశం ఉన్నట్లు తెలిపింది వాతావరణ శాఖ. హైదరాబాద్ లో చార్మినార్, ఖైరతాబాద్, కూకట్‌పల్లి, ఎల్‌బీ నగర్, సికింద్రాబాద్, శేరిలింగంపల్లి వంటి ప్రాంతాల్లో ఉదయం పూట పొగమంచు ఉండే అవకాశం ఉందని తెలిపింది వాతావరణ శాఖ. ఈ క్రమంలో హైదరాబాద్ వాసులు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని.. పొగమంచు ఉండే సమయంలో వాహనదారులు జాగ్రత్త వహించాలని సూచించింది వాతావరణ శాఖ.

## ఆంధ్రా అల్లుడికి 130 రకాల తెలంగాణ వంటకాలతో విందు..




**హైదరాబాద్ పెన్ పవర్:**సంక్రాంతి పండుగకు వచ్చిన కొత్త అల్లుడికి తెలంగాణ అత్తమామలు అదిరిపోయే విందు ఇచ్చారు. ఏకంగా 130 రకాల వంటకాలను వండి వడ్డించి ఆంధ్రా అల్లుడిని సర్ ప్రైజ్ చేశారు. హైదరాబాద్ సరూర్ నగర్ సమీపంలోని శారదానగర్ కు చెందిన క్రాంతి, కల్పన దంపతులు తమ అల్లుడికి ఈ విందు ఇచ్చారు. ప్రస్తుతం ఈ వీడియో సోషల్ మీడియాలో వైరల్ గా మారింది.

క్రాంతి, కల్పన దంపతులకు ఇద్దరు అమ్మాయిలు. నాలుగు నెలల క్రింత పెద్దమ్మాయిని కాకినాడకు చెందిన మల్లికార్జున్ కు ఇచ్చి వివాహం చేశారు. తాజాగా సంక్రాంతి పండుగకు వచ్చిన అల్లుడికి తెలంగాణ వంటకాలను రుచి చూపించాలని భారీగా వంటకాలు చేసిపెట్టారు. తెలంగాణ పిండి వంటలతో పాటు బగారా, పులిహోరా.. ఇలా 130 రకాల వెజ్, నాన్ వెజ్ వంటకాలను వడ్డించారు.

# నిబంధనలకు విరుద్ధంగా నడుస్తున్న ప్రైవేటు ట్రావెల్స్‌కు తెలంగాణ రవాణా శాఖ షాక్



**హైదరాబాద్ పెన్ పవర్:**ట్రావెల్స్ బస్సులపై తెలంగాణ రవాణా శాఖ కొరడా ఝుళిపించింది. నిబంధనలకు విరుద్ధంగా బస్సులు నడుపుతున్న పలు ట్రావెల్స్ సంస్థలపై 300కు పైగా కేసులు నమోదు చేసింది. సంక్రాంతి పండుగ సందర్భంగా వివిధ ప్రైవేటు రవాణా సంస్థలు నిబంధనలకు విరుద్ధంగా బస్సులను తిప్పుతున్నట్లు గుర్తించిన రవాణా శాఖ నాలుగు రోజులుగా తనిఖీలు చేపడుతోంది. హైదరాబాద్, రంగారెడ్డి, నల్గొండ, నిజామాబాద్, మహబూబ్ నగర్ తదితర ప్రాంతాల్లో 12 ప్రత్యేక బృందాలుగా ఏర్పడి తనిఖీలు చేపట్టింది. హైదరాబాద్‌లోని ఎల్బీ నగర్, ఆరాంఘర్ వద్ద తనిఖీల సందర్భంగా నిబంధనలకు విరుద్ధంగా బస్సులు తిరుగుతున్నట్లు గుర్తించారు. ఈ మేరకు రవాణా శాఖ ఎన్‌ఫోర్స్‌మెంట్ జాయింట్ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ చంద్రశేఖర్ గౌడ్ తెలిపారు.తనిఖీలు నిరంతరం కొనసాగుతాయని వెల్లడించారు. సంక్రాంతి పండుగ సమయంలో ప్రైవేటు ట్రావెల్స్ బస్సులు ఇష్టానుసారంగా ఛార్జీలను వసూలు చేస్తున్నట్లు తమకు ఫిర్యాదులు అందాయన్నారు. ఈ క్రమంలో తనిఖీలు చేపట్టామని, ఇదే సమయంలో నిబంధనలకు విరుద్ధంగా తిరుగుతున్న వాహనాలపై దృష్టి సారించామన్నారు.

# పండగ పూట అత్యాశకు పోతే అకౌంట్ ఖాళీ అవుతది జాగ్రత్త..!

## సైబర్ క్రైమ్ పోలీసుల సూచన




**హైదరాబాద్ పెన్ పవర్:**సంక్రాంతి పండగను ఆసరాగా చేసుకుని సైబర్ నేరగాళ్లు రెచ్చిపోతున్నారు. పండగ వేళ ఆఫర్ల పేరిట సైబర్ కేటుగాళ్ల కొత్త ఎత్తుగడలు వేస్తున్నారు. ఉచిత రీ ఛార్జులు, గిఫ్ట్ లు అంటూ ఆశ చూపి బురిడి కొట్టిస్తున్నారు. ఈ క్రమంలో ప్రజలకు సైబర్ క్రైమ్ పోలీసులు కీలక సూచనలు చేశారు. సంక్రాంతి బంపర్ ఆఫర్ల మాయలో పడొద్దని.. ఉచిత రీచార్జ్ అని వచ్చే మెసేజ్ లను నమ్మొద్దని సూచించారు. లింక్ మరో 10 మందికి షేర్ చేస్తే ఫ్రీ రీచార్జ్ వస్తుందన్నది ఫేక్ అని.. పండుగ సీజన్ ను క్యాష్ చేసుకుని సైబర్ నేరగాళ్లు బంపర్ ఆఫర్ అని ఊరించే ప్రకటనలు చేస్తే ఆశపడి ఆ లింక్ క్లిక్ చేయొద్దన్నారు. అత్యాశకు పోయి సైబర్ నేరగాళ్ల ఉచ్చులో చిక్కితే అకౌంట్ ఖాళీ అవుతోందని చెప్పారు. సైబర్ నేరగాళ్లు పంపిన లింక్ క్లిక్ చేస్తే ఫ్రీ రీఛార్జ్ రాదని.. మీ ఫోన్ లో మాల్వేర్ ఇన్ స్టాల్ అవుతోందని తెలిపారు. అత్యాశ పోయి సైబర్ మోసాలకు గురి అయ్యి పండుగ పూట బాధ పడొద్దని సూచించారు. గుర్తు తెలియని నెంబర్ల నుండి వచ్చే మేసేజులు, ఫోన్ల విషయంలో క్షణమాగి ఆలోచించి ఆ తర్వాత స్పందించడని చెప్పారు. ప్రస్తుతం పెరిగిపోయిన డిజిటల్ మోసాలపై ఆందోళన చెందకుండా, అప్రమత్తంగా ఉండండిన సూచించారు. గుర్తు తెలియని అనుమానిత నెంబర్ల నుండి ఫోన్లు, మేసేజులు వచ్చిన, సైబర్ మోసానికి గురైన వెంటనే 1930 నంబరుకు కాల్ చేయండని సూచించారు. లేదంటే సైబర్ క్రైమ్ పోర్టల్‌లో ఫిర్యాదు చేయాలని చెప్పారు.

# బాప్‌రే బాప్.. మహా కుంభమేళా ద్వారా ఉత్తరప్రదేశ్ కి ఇంత భారీ ఆదాయమా...!



**హైదరాబాద్ పెన్ పవర్:**12 ఏళ్లకు ఒకసారి వచ్చే మహా కుంభమేళా ఈరోజు ఉదయం ఉత్తరప్రదేశ్‌లోని ప్రయాగ్‌రాజ్‌లో ఘనంగా ప్రారంభమైంది. గంగా, యమునా, సరస్వతి నదులు కలిసే ప్రదేశమైన త్రివేణి సంగమం వద్ద 50 లక్షల మందికి పైగా భక్తులు మొదటి పవిత్ర స్నానం ఆచరించారు.ప్రపంచంలోనే అతిపెద్ద మానవాళి సభగా పేర్కొనబడిన ఈ సహస్రాబ్దాల నాటి కుంభమేళా ఈసారి ప్రయాగ్‌రాజ్‌కు 40 కోట్ల మందికి పైగా భక్తులను తీసుకువస్తుందని అధికారులు భావిస్తున్నారు. ఈ కార్యక్రమం కోసం యూపీలోని యోగి ఆదిత్యనాథ్ సర్కార్ సుమారు 4,000 హెక్టార్లలో ఏర్పాట్లు చేసింది. ఇవాళ్టి నుంచి ఫిబ్రవరి 26 వరకు ఈ మహా కుంభమేళా కొనసాగనుంది. 45 రోజుల పాటు జరిగే ఈ మెగా ఈవెంట్ కోసం యూపీ ప్రభుత్వం ఏకంగా రూ.7,000 కోట్ల బడ్జెట్ కేటాయించింది. ఇక ఈ భారీ ఈవెంట్ ద్వారా ఉత్తరప్రదేశ్ ఖజానాకు అంతే భారీగా ఆదాయాన్ని తెచ్చిపెడుతోందని అంచనా.

**మహా కుంభమేళా ద్వారా యూపీ ప్రభుత్వానికి రూ. 2 లక్షల కోట్ల వరకు ఆదాయం**

మహా కుంభమేళా 2025 ఉత్తరప్రదేశ్ కి రూ. 2 లక్షల కోట్ల వరకు ఆదాయాన్ని తెచ్చిపెట్టే అవకాశం ఉందని ట్రేడ్ వర్గాలు అంచనా వేస్తున్నాయి. 40 కోట్ల మంది సందర్శకులు ఒక్కొక్కరు సగటున రూ. 5,000 ఖర్చు చేస్తే ఈ మెగా ఈవెంట్ ద్వారా రూ. 2 లక్షల కోట్ల వరకు ఉత్తరప్రదేశ్ రాష్ట్రం ఆర్జించవచ్చని చెబుతున్నాయి.న్యూస్ ఏజెన్సీ ఐఏఎన్ఎస్ ట్రేడ్ వర్గాల అంచనాలను ఉటంకిస్తూ, ఒక వ్యక్తి సగటు వ్యయం రూ. 10,000 వరకు పెరగవచ్చని తెలిపింది. తద్వారా మొత్తం ఆదాయం రూ. 4 లక్షల కోట్లకు చేరుకోవచ్చని పేర్కొంది. ఇది ఆ రాష్ట్ర నామమాత్ర, వాస్తవ జీడీపీ రెండింటినీ 1 శాతానికి పైగా పెంచుతుందని అంచనా వేసింది.ఉత్తరప్రదేశ్ సీఎం యోగి ఆదిత్యనాథ్ మాట్లాడుతూ... 2019లో జరిగిన ప్రయాగ్‌రాజ్ అర్ధ కుంభమేళా రాష్ట్ర ఆర్థిక వ్యవస్థకు 1.2 లక్షల కోట్ల రూపాయల

ఆదాయాన్ని అందించిందని అన్నారు. ఆ ఈవెంట్‌ను దాదాపు 24 కోట్ల మంది భక్తులు సందర్శించినట్లు తెలిపారు. ఇక ఈ ఏడాది మహా కుంభమేళాకు 40 కోట్ల మంది భక్తులు వస్తారని, రూ. 2 లక్షల కోట్ల వరకు ఆదాయం వస్తుందని అంచనా వేస్తున్నట్లు ఆయన ఇటీవల ఒక న్యూస్ ఛానెల్‌తో అన్నారు.

# రైతు భరోసా: సాగు లేని భూములను ఇలా గుర్తిస్తారు..గ్రామాల్లోకి ఫీల్డ్ వెరిఫికేషన్ టీమ్స్




**హైదరాబాద్ పెన్ పవర్:**పోడు భూములకూ (ఆర్‌వోఎఫ్‌ఆర్ పట్టాలు) రైతు భరోసా ఇవ్వాలని సర్కారు నిర్ణయించింది. పంట వేసినా.. వేయకున్నా.. సాగు యోగ్యమైన భూములకు రైతు భరోసా పేరుతో రైతాంగానికి పెట్టుబడి సాయం కింద ఏటా ఎకరానికి రూ.12 వేలు ఇవ్వనున్నది. ఈ నేపథ్యంలో రాష్ట్ర సర్కారు ఈ పథకం కోసం ప్రత్యేక మార్గదర్శకాలు జారీ చేసింది. రాష్ట్ర వ్యవసాయశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ తాజాగా ఉత్తర్వులు (తెలుగులోనూ) జారీ చేశారు. గ్రామీణ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయడానికి, ఆహార భద్రత కల్పించేందుకు చేపట్టిన ఈ కార్యక్రమాన్ని జనవరి 26 నుంచి సర్కారు అమలు చేయనున్నది.

**సాగు యోగ్యత లేని భూముల గుర్తింపునకు ఫీల్డ్ వెరిఫికేషన్ టీమ్స్**

సాగు యోగ్యత లేని భూములను గుర్తించేందుకు ఫీల్డ్ వెరిఫికేషన్ టీమ్‌లను రంగంలోకి దించుతున్నారు. పంచాయతీరాజ్, మండల రెవెన్యూ, అగ్రికల్చర్ అధికారుల సారథ్యంలో సాగు యోగ్యంలో లేని భూముల గుర్తింపు ప్రక్రియను చేపట్టనున్నారు. పంచాయతీ సెక్రటరీ, ఏవోలు, ఆర్ఐ లు ఫీల్డ్ వెరిఫికేషన్ టీమ్ లీడర్స్‌గా ఉంటారు. ఫీల్డ్ వెరిఫికేషన్ టీమ్ లో రెవెన్యూ విలేజ్ అసిస్టెంట్, జీపీఎస్, ఫీల్డ్ అసిస్టెంట్, ఆర్ఏ, ఏఈవోలు సభ్యులుగా ఉంటారు. జిల్లా కలెక్టర్ సారథ్యంలోని డీఏవోలు, ఎంపీడీవోలు తదితర ఉన్నతాధికారులు ఈ టీమ్‌లను పర్యవేక్షిస్తారు.

**ఇలా గుర్తిస్తారు..**

ఫీల్డ్ వెరిఫికేషన్ టీమ్‌లు విలేజ్‌లో ఎక్కడెక్కడ నాన్ అగ్రికల్చర్ ల్యాండ్‌లు ఉన్నాయో గుర్తిస్తాయి. ప్రతి గ్రామంలో వ్యవసాయ విస్తరణాధికారి, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు బృందంగా సర్వే చేస్తారు. ఆయా గ్రామాల్లోని ఆర్వోఆర్, పట్టాదారు పాస్‌పుస్తకాల జాబితాను పరిశీలిస్తారు. భూ భారతి పోర్టల్ నుంచి జాబితా, విలేజ్ మ్యాప్, గూగుల్ మ్యాప్‌ల ఆధారంగా పర్యవేక్షించి, వ్యవసాయ యోగ్యంకాని భూముల జాబితాను రూపొందిస్తారు. దాని ఆధారంగా తహసీల్దారు, వ్యవసాయాధికారులు సంయుక్తంగా జాబితాలోని సర్వే నంబర్లలో ఉన్న భూములను పరిశీలించి, వ్యవసాయ యోగ్యం కాని వాటిని గుర్తిస్తారు. ఆ భూముల జాబితాను గ్రామసభల్లో ప్రదర్శించి, చదివి వినిపించి, చర్చించిన అనంతరం ఆమోదం తీసుకుంటారు. అభ్యంతరాలు ఉంటే వాటిని పరిశీలిస్తారు. అనంతరం గ్రామాలవారీగా వ్యవసాయ యోగ్యంకాని భూముల పట్టికను పోర్టల్‌లో సంబంధిత అధికారి నమోదు చేసి, డిజిటల్ సంతకం చేస్తారు. ఈ నెల 16 నుంచి 19 వరకు ఫీల్డ్ వెరిఫికేషన్ ప్రక్రియ చేపట్టనున్నారు. 25న ఈ జాబితాలను జిల్లాలవారీగా రాష్ట్ర ప్రభుత్వానికి పంపిస్తారు. వాటి ఆధారంగా వ్యవసాయ యోగ్యం కాని భూములను తొలగించి.. మిగిలిన భూముల జాబితా ఆధారంగా పట్టాదారులకు రైతు భరోసా సాయాన్ని ప్రభుత్వం జనవరి 26న విడుదల చేస్తుంది.